"విశాలీ! విశాలీ!" అంటూ హాల్లోంచి ఓ కేకపెట్టాడు శివ రావు.

వంటింట్లో పనిలో ఉన్న విశాలాక్షి ఒక్కసారి అదిరిపడింది.

"ఏమిటండీ! పిల్చారు ఏం కావాలీ?" అంది మెల్లిగా.

"ఏమీ అక్కర్లేదు. ఇదిగో ఇది చూడు" అని విసిరి బల్ల మీద పడేశాడు.

"ఓ శుభలేఖా? ఆడపెళ్లివారి శుభలేఖ వచ్చిందా?" అంది.

"ఆ శుభలేఖే! చూడు ఎంత లక్షణంగా ఉందో? పిసినారి మొహంలా ఉన్నాడు ఆయన"

"శుభలేఖ గ్రాండ్‌గా లేదనా మీ బాధ? శుభలేఖ ఎలా ఉంటే ఏమిటండీ? అందులో వర్తమానం కదా ముఖ్యం" అంది.

-"చూడు. ఇలాగే నా నోరునొక్కి కట్నం కూడా అడగక్కుండా చేశావు. శుభ లేఖలే ఇలా ఉంటే ఇక లాంఛనాలు ఎలా చేస్తారో చూడాలి. ఆఖరికి నలుగు రిలో మన పరువు దక్కుతుందో? లేదో?"

"చూడండి. మనకి పరువు ముఖ్యమా? మనింటికి వచ్చి మనలో కలిసి పోయే అమ్మాయి ముఖ్యమా? మనకొడుకు, కోడలు అన్యోన్యంగా కన్నులపం టగా ఉంటుంది. తృప్తిలేనివాళ్లకి ఎంత చేసినా ఇంకా తక్కువ చేశారనే అనిపి స్తుంది"

"అబ్బ! చాలించు నీ ఉపన్యాసం. నలుగురూ 'మీ అబ్బాయి పెళ్ళి ఎంత బాగా జరిగిందండీ. ఎంత మంచి సంబంధం వచ్చింది. అదృష్టమంటే మీదే నండీ!మీకు తగిన సంబంధం' అంటూ మెచ్చుకుంటే ఆనందంగా ఉంటుంది గానీ 'మీ వియ్యాలవారు ఏమిటండీ మరీ పిసినారుల్లా ఉన్నారు' అంటే ఏం బాగుంటుంది. మనకి తలకొట్టేసినట్టు ఉండదా?" అన్నాడు శివరావు.

"మీకుంటుందేమోగాని నాకుండదు. ఎందుకంటే అలా అనేవారికి తగిన సమాధానం చెప్పి నోరు మూయించగలను కనుక. అయినా ఏదో వచ్చి పెళ్లి

# గతస్మృతులు

- ఆర్.ఎస్.హైమవతి



చూసి, పెట్టిందేదో తినేసి వెళ్లాలని గానీ ఇలా వ్యాఖ్యానించి మనల్ని అవమానపరచాలనుకునేవారిని మనం లెక్క చెయ్యక్కర్లేదండీ'' అంటూ వంటింట్లోకి వెళ్లిపోయింది విశాలాక్షి.

* * *

విశాలాక్షి సామాన్య కుటుంబంలో పుట్టి పెరిగింది. ఆమె తండ్రి వ్యవసాయాన్ని నమ్ముకున్నాడు. అతివృష్టి, అనావృష్టితో పంటలు సరిగా చేతికందక ఉన్న ఆస్తి అంతా కర్పూరంలా కరిగిపోయింది. విశాలాక్షి ఆఖరు సంతానం కావడంతో ఆమె పెళ్లి ఘనంగా చెయ్యలేకపోయారు. వియ్యాలవారికి ముట్టచెప్పవలసినవి ముట్టచెప్పినా శివరావు తల్లిదండ్రులు అసలు సంతృప్తి పడలేదు. విశాలాక్షి అందాన్ని, గుణగణాల్ని, తెలివితేటల్ని ఎరిగి ఉన్న శివరావు చేసుకుంటే విశాలాక్షినే చేసుకుంటానని పట్టుబట్టడంతో ఇక చేసేది లేక ఏదో ఒప్పుకున్నారు అతడి తల్లిదండ్రులు.

## అలవాటు

"మీరు చాలా మంచివారు సార్''

"వెరీగుడ్. నీకు అన్ని నిజాలు చెప్పే అలవాటు వున్నందుకు సంతోషం''

"సార్! మీరు పొరబడుతున్నారు.''

"నీవు చెప్పేది దేని గురించి?''

"నేను అన్నీ అసత్యాలే చెబుతాను సార్.''

**-షేక్ అస్లాం షరీఫ్** (శాంతినగర్)

## అద్దెకు...


"ఒకేసారి ఒక టూ వీలర్, ఒక త్రీ వీలర్, ఒక ఫోర్ వీలర్ కొంటున్నారెందుకు?'' కస్టమర్ని ప్రశ్నించాడు షాపు యజమాని.

"మా అమ్మాయికి పెళ్లి కుదిరింది. కాబోయే అల్లుడికి కానుకగా ఇవ్వడానికి ఫోర్ వీలర్, మా అబ్బాయికి కాలేజీలో సీటు దొరికింది. వాడు కాలేజీకి వెళ్లడానికి టూ వీలర్ కొంటున్నాను'' చెప్పాడు కనకారావు.

"మరి త్రీవీలర్ ఎందుకో చెప్పనేలేదు'' మళ్లీ ప్రశ్నించాడు షాపు యజమాని.

"అమ్మాయి పెళ్లి, అబ్బాయి కాలేజీ ఫీజులతో నా ఆస్తులన్నీ పోయాక అద్దెకు తిప్పుకోవడానికి'' భారంగా చెప్పాడు కనకారావు.

**-మారిశెట్టి వెంకన్నబాబు** (కోరుకొండ)




ఆ విధంగా అత్తవారింట అడుగుపెట్టిన విశాలాక్షికి జీవితంలో అడుగడుగునా ముళ్లకంచెలే ఎదురయ్యాయి. అత్తగారికి విశాలాక్షి ఏం మాట్లాడినా, ఏం చేసినా తప్పుగానే కనబడేది. మళ్లీ కొడుకు శివరావు ఆఫీసునించీ వచ్చే సమయానికి ఏమీ జరగనట్టు కోడల్ని బాగా చూసుకుంటున్నట్లు నటించేది. అత్తగారిగా మారాక తన జీవితంలా తన కోడలి జీవితం కాకూడదని కోరుకుంది. అందుకే కొడుకు మీద ఏ బాధ్యతా పెట్టకుండా తన భర్త రిటైరయ్యేలోపల ఆడపిల్ల పెళ్లి చేయించేసింది. అల్లుడు మంచివాడే దొరికాడు. కొడుకు మంచి స్ఫురద్రూపి, మంచి చదువు, ఉద్యోగం అన్నీ ఉన్నాయి. ఎంతో మంది కట్నాలు ఇస్తామని వచ్చినా, కొడుకు తనకి నచ్చిందన్న అమ్మాయినే ఇచ్చి పెళ్లి చేయాలని ఈ సంబంధాన్ని స్థిరపరచడం జరిగింది. శివరావు భార్య భావాలకి వ్యతిరేకి కాదు.

* * *

విశాలాక్షి, శివరావుల కొడుకు రాము పెళ్లి నిరాడంబరంగా జరిగిపోయింది. విశాలాక్షి కోడలికి పన్నెండు కాసుల బంగారం పెట్టింది. వియ్యాలవారు పెట్టినవి పుచ్చుకున్నారు గానీ ఒక్క వస్తువు కూడా అడగలేదు విశాలాక్షి, శివరావులు. వచ్చిన అమ్మలక్కలు ఏమైనా అన్నా "వియ్యాలవారు ఇచ్చేవాటికన్నా అమ్మాయి మా ఇంట్లో కలిసిపోవడమే మాకు నిజంగా ఆనందాన్ని ఇస్తుంది'' అనేసింది.

* * *

రాము ఈ కాలపు కుర్రాళ్లా అమ్మా, నాన్నలకి దూరంగా భార్యతో ఎప్పుడెప్పుడు వెళ్ళిపోదామా అని చూసేవాడు కాదు. తల్లిదండ్రుల్ని బాగా చూసుకుని, తనకి సహకరించే భార్య కావాలని కోరుకున్నాడు. అందుకు వనజ కూడా అంగీకరించింది. వాళ్లు ఉంటున్నది సిటీయే కావడం వల్ల తనకి ఉద్యోగం ఉన్న ఊళ్ళోనే రావడం అదృష్టంగా భావించాడు. తల్లిదండ్రులకి దూరంగా వెళ్ళవలసిన అవసరం రాలేదు. కొత్తలో ఒకరోజు సాయంకాలం రామనామం రాసుకుంటున్న విశాలాక్షి దగ్గరకి వనజ వచ్చి "అత్తయ్యా! ఎన్ని బియ్యం పెట్టమంటారు? ఈ గిన్నె ఉడుకుతుందా? పాలు ఈ గిన్నెతో కాచనా?'' అని అడిగింది.

విశాలాక్షికి ముప్ఫై ఐదేళ్ళ గతం గుర్తుకొచ్చింది.

* * *

అపుడు తనకు ఇరవై నాలుగేళ్లు. అది ఆలస్యపు పెళ్లని అత్తగారి భావం. "ఇంత ఈడొచ్చాక పెళ్ళయింది. ఆ మాత్రం తెలియదూ!'' అంటూ మొదలెట్టి అరగంట క్లాస్ తీసుకుంది తన అత్తగారు. ఆఖర్న చెప్పింది ఎంత వండాలి? ఏ గిన్నెలో వండాలో. రెండవరోజు అడగకుండా తనే అన్నం, కూర అదీ చేసేసింది. ఆరోజూ మరోలా మొదలెట్టింది గట్టిగా అరవడం అత్తగారు.

"అయ్యో! అత్తగారింట్లో ఉన్నాం. అడగాలి. చెప్పినట్టు చెయ్యాలి అనే అణకువే లేదు. అన్నిటికీ స్వతంత్రాలు. అత్తగారంటే భొత్తిగా గౌరవం లేదు. అలాంటప్పుడు వేరేగా ఉండాల్సింది. మా మీద గౌరవం లేకపోయాయక మా ఇంట్లో ఉండడం ఎందుకు?'' అంటూ గట్టిగా అరిచేసరికి భయపడిపోయిన విశాలాక్షి "లేదత్తయ్యా! నిన్న అడిగితే మీరు ఆ ఆమాత్రం తెలియదా అన్నారు కదాని...'' అంటూ మెల్లిగా అంటుంటే...

"అవునే! అంటాను. ఎన్నైనా అంటాను. నువ్వు కోడలివి. నేను అనాలి. నువ్వు పడాలి. మేమంతా అత్తగారింట్లో ఎన్నెన్ని కష్టాలు పడ్డాం. మీకలాంటి కష్టాలు ఏమున్నాయి?'' అంటూ మరో క్లాసు.

"ఈ గిన్నెలో పెట్టమంటారా? అత్తా!'' అంటూ కోడలు వనజ మరోసారి అడిగేసరికీ "ఏదో పరధ్యాన్నంగా ఉన్నానమ్మా! ఏమీ అనుకోకు. రెండుగ్లాసులు బియ్యం పెట్టు ఈ గిన్నె ఉడుకుతుంది. ప్రెషర్ పాన్లో పెట్టెయ్యి. అయినా నీకేదైనా పని ఉంటే చూసుకోమ్మా. నేనొచ్చి పెడతాలే'' అంది.

"లేదత్తయ్యా! మీ అబ్బాయి తెచ్చిన నవల, మేగజైన చదివేశాను. తోచడం

లేదు. అందుకే నేనే రాత్రికి వంట చేసేస్తాను. మీరు రాసుకోండి'' అంది వనజ.

''సరేనమ్మా! ఆ! వనజా కుక్కర్ మెల్లిగా తరువాత పెట్టచ్చులే. చీకటి పడకుండా ఆ పువ్వులు ఉన్నాయి కదా! కోసుకురా. నీకు కట్టడం రాకపోతే నేను కట్టిస్తాను. పెట్టుకుందువుగాని'' అంది విశాలాక్షి.

''ఆ! అవునత్తయ్యా! మరిచేపోయాను. నాకు కట్టడం వచ్చు. కట్టడం సరదా కూడాను'' అంటూ చకచకా గిన్నె పట్టుకుని పూలు కొయ్యడానికి వెళ్తున్న కోడలిని తృప్తిగా చూసుకుంది విశాలాక్షి.

★ ★ ★

''అమ్మా! ఇవాళ నేను, వనజ సినిమాకి వెళ్తున్నామమ్మా! అలాగే మాకు మున్నార్‌కి టిక్కెట్లు రిజర్వేషన్ చేయించుకుంటాం. వచ్చేటప్పటికి లేటవుతుంది. మీరు భోజనం చేసెయ్యండి'' చెప్పాడు రాము.

''మరి ఆఫీసులో లీవ్‌కి అప్లయ్ చేశావా?'' అడిగాడు శివరావు.

''ముందుగా లీవ్‌కి అప్లై చేస్తే ఆరోజుకి రిజర్వేషన్ దొరుకుతుందని గ్యారంటీ లేదు. అందుకే ముందుగా వెళ్లిరావడానికి రిజర్వేషన్ చేయించుకున్నాక అప్పుడు లీవ్ అప్లై చేస్తాను. ఇప్పటికే ఆఫీసులో అంతా హనీమూన్ ఎక్కడికి అంటూ అడుగుతున్నారు'' అన్నాడు రాము.

''వెళ్ళొస్తాం అత్తయ్యా!'' అంటూ కోడలు చెప్పి రాము వెనక బైక్ మీద ఎక్కి కూచుంది. విశాలాక్షికి మళ్లీ గతం గుర్తుకొచ్చింది.

★ ★ ★

హనీమూన్‌కి వెళ్లొస్తానని తల్లితో చెప్పడానికి ధైర్యం చాలలేదు శివరావుకి. దానికి విశాలాక్షి ఓ ఆలోచన చెప్పింది "హనీమూన్‌కంటే బాగోదు తిరుపతి, కాళహస్తి అవీ చూసుకుని వస్తామని చెప్పి వెళ్దాం'' అంది.

ఈ ఆలోచన శివరావుకి నచ్చింది. విషయం తల్లిదండ్రులకి చెప్పాడు. తండ్రి సరే అన్నాడు. తల్లి మాత్రం మొదలెట్టింది. ఆ తర్వాత జరిగిన సంఘటలన్నీ ఆమెకి గుర్తుకొచ్చాయి. ఈలోగా భర్త శివరావు భార్యని పిలిచి"నువ్వెందుకలా పిల్చినా పలకకుండా పరధ్యానంగా ఉంటున్నావు. ఆరోగ్యంగానీ బాగా లేదా?'' అని అడిగాడు.

''లేదండీ! నా ఆరోగ్యానికేం ఢోకాలేదు. నిక్షేపంలా ఉన్నాను. పాపం పరాయి పిల్లయినా కోడలు వనజ మనమ్మాయి శాంతికన్నా ఎక్కువగా నాకు అన్ని పనుల్లో సాయం చేస్తోంది. నేను ఏపనీ తనకి చెప్పకపోయినా సందర్భాన్ని, అవసరాన్ని కనిపెట్టి కూడా ఉండి చేతిలో పని అందుకుని చకచకా చేస్తోంది. నాకు తృప్తిగా ఉందండీ.కానీ...''

''ఏమిటి. కానీ చెప్పు. నా దగ్గర నీకు దాపరికం ఎందుకు?'' అడిగాడు శివరావు.

''నేను నా పెళ్లైన కొత్తలో ఇలా హుషారుగా, చలాకీగా, చురుగ్గా పనులు చేసేదాన్ని. మీకు తెలుసుగా!'' అంది.

''అవును. ఇప్పుడు ఎవరు కాదన్నారు?''

''మీరు కాదనలేదు గానీ ప్రతి మాటకీ, ప్రతిపనికీ నన్ను తప్పుపట్టి తిట్టిపోసేవారు మీ అమ్మ. ఇప్పుడా సంఘటలన్నీ ఒక్కొటి గుర్తుకొస్తున్నాయి. అందుకే అలా పరధ్యాన్నంలోకి వెళ్ళిపోతున్నాను. అంతకుమించి వేరే అనారోగ్యం ఏమీ లేదు'' అంది విశాలాక్షి.

''ఓస్! అదా అప్పుడే నాతో ఆ విషయం చెప్పి ఉంటే నేను నీకు చెప్పి ఉండేవాణ్ణిగా. ఆ విషయాలన్నీ అప్పటినుంచీ ఇప్పటివరకూ ముప్పై ఏళ్ళుగా మనసులో పెట్టుకుని బాధపడుతున్నావా? పిచ్చి విశాలాక్షీ!'' అంటూ దగ్గరకు తీసుకున్నాడు శివరావు.

''ఏమిటది?'' అంది గోముగా.

''అదే! మా అమ్మకి నీ మీద కోపం లేదు. పైగా వదినకన్నా నీవే పని బాగా చేస్తావని, చురుకైనదానివని, తెలివైనదానివని అంటూ ఉండేది. ఆ మాట నీ దగ్గర అంటే నీవు నెత్తికెక్కి కూర్చుంటావని ఆవిడ అలా చెప్పేదికాదు. పైగా పోయేటప్పుడు కూడా నన్ను పక్కకి పిలిచి చెప్పింది''

''ఆ! నిజంగానా? ఆశ్చర్యంగా ఉందండీ! మరి మీరెందుకు ఆ విషయం చెప్పలేదు?'' అంది విశాలాక్షి.

''ఆ! చెప్తే నువ్వు ఇంకా నానెత్తికెక్కి కూర్చోవూ?''

''అవున్లెండి. ఎలాగైనా అమ్మకి కొడుకు కదా!''

''తెలిసిందా? కాబట్టి నువ్వు కూడా కోడలిని తెగ పొగిడేసి నెత్తికెక్కించుకోకు''

''పొగడకపోయినా తిట్టాల్సిన పనిలేదు. ఆ విధంగా ప్రవర్తించి అత్తగారి హోదా నిలబెట్టుకోవాలనే తాపత్రయం నాకు లేదు. ఈ రోజుల్లో అలా చేస్తే ఛీ కొట్టి వెళ్ళిపోతారు. అలా ప్రవర్తించడానికి నాకే మనసురాదు''

''అందుకేకదోయ్! అప్పుడే అందరిచేత మంచి అత్తగారు అనే సర్టిఫికెట్ కొట్టేశావు'' అన్నాడు నవ్వుతూ శివరావు.

★

## బయో డీజిల్

సహజ ఇంధన వనరులు క్రమేణా తరిగిపోతున్నాయి. భవిష్యత్తు ఇంధన అవసరాలపై ఇప్పటి నిల్వలు పొదుపుగా వాడుకోవాలి. అలాగే ప్రత్యామ్నాయ ఇంధన వనరులకై అన్వేషణ సాగించాలి. ఈమధ్య బయోడీజిల్ వాడకంపై ఆశాజనకమైన వార్తలొస్తున్నాయి. పొంగామియా, జట్రోపాతోపాటు మరి ఇతర నూనె మొక్కల నుండి బయోడీజిల్ లభిస్తుంది. జర్మనీ తదితర పాశ్చాత్య దేశాలలో బయోడీజిల్ విస్తృత ప్రాచుర్యం పొందుతోంది. మన దేశంలో 5-10 మిలియన్ల హెక్టార్ల నిరుపయోగ భూములున్నాయి. ఈ బంజరు భూములలో నూనెనిచ్చే మొక్కల్ని పెంచడంవల్ల బయోడీజిల్ లభించడంతోపాటు గ్రామీణ ఉపాధి లభిస్తుంది. గిరిజనులు, సన్నకారు రైతులు లబ్ది పొందుతారు. గ్రామీణ మహిళలు వీటి పెంపకంవల్ల ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు. బయోడీజిల్ మొక్కల పెంపకంవల్ల పర్యావరణం బాగుపడుతుంది. ఈ కారణంగా కేంద్ర ప్రభుత్వం బయోడీజిల్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం ఆర్థిక ప్రోత్సాహకాలను అందించాలనుకుంటోంది. హైదరాబాద్‌లో 2.5 మిలియన్ల డాలర్ల వ్యయంతో నెలకొల్పనున్న బయోడీజిల్ పైలెట్ ప్రాజెక్ట్ రోజుకు పది టన్నుల బయోడీజిల్‌ను ఉత్పత్తి చేయనుంది. ప్రారంభ దశలో బయోడీజిల్‌ను సిటీబస్సులు, మున్సిపల్ ట్రక్కులు, త్రిచక్ర వాహనాలలో వినియోగించాలని భావిస్తున్నారు. ఈ బయోడీజిల్ వాడకం విస్తృతమైతే ఖర్చు తగ్గడంతోపాటు కాలుష్యం కూడా అదుపులో వుంటుంది.

-సమ్మెట

